క్లుప్తంగా

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



బద్వేలు అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయమని బద్వేలు అర్బన్ సీఐగా ఎం.రాజ గోపాల్ ప్రకటించారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఈయన జిల్లాలోని బి.మఠం, రాజుపాలెం స్టేషన్లలో ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం సీఐగా పదోన్నతి పొంది తిరుపతి జిల్లా పాకాల సీఐగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో బద్వేలు అర్బన్ సీఐగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

భారత హాకీ జట్టుకు అభినందనలు

పోరుమామిళ్ల: భారత హాకీ జట్టుకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ యువనేత డీసీ అదిత్యారెడ్డి అభినందనలు తెలిపారు. దశాబ్దాల నిరీక్షణ తరువాత భారత జట్టు ఒలంపిక్స్‌లో కాంస్య పతకం సాధించిందని కొనియాడారు. వచ్చే ఒలంపిక్స్‌కు మరింత మెరుగైన ప్రదర్శనతో బంగారు పతకాన్ని సాధించాలని ఆకాంక్షించారు.

మార్కెట్ వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్ దినసరి రుసుంల వసూళ్లకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన వేలం పాట రూ.90.20 లక్షలు పలికింది. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సమావేశ భవనంలో వేలం పాట నిర్వహించారు. మొత్తం ఐదు మంది వేలంలో పాల్గొనేందుకు డిపాజిట్లు చెల్లించగా వీరిలో అత్యధికంగా భూమిరెడ్డి రామాంజనేయరెడ్డి రూ.90.20లక్షలుతో దక్కించుకున్నారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు పాటదారుడు రుసుం వసూలు చేసుకోవచ్చు అని కమిషనర్ తెలిపారు.

రోడ్డు బాగు చేయండి



దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్

కలసపాడు : స్థానిక గిద్దలూరు రోడ్డుపై నడిరోడ్డుపై గుంతలు ఏర్పడినా అధికారులు పట్టించుకోవడం లేదని కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వినూత్నంగా దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం పడినప్పుడు గుంతల్లో నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సుదర్శన్, ఆవాజ్ మండలాధ్యక్షుడు హుస్సేన్ పీరా తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడుకుందాం



నిరసన ర్యాలీ చేస్తున్న నాయకులు

పోరుమామిళ్ల: కేంద్ర కార్మిక రైతు వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందామని పలు కార్మిక, రైతు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం అంబేడ్కర్ భవనం ముందు క్విట్ కార్పొరేట్ ఇండియా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్, రైతు నాయకులు భైరవప్రసాద్, లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజాకార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందన్నారు. జాతీయ సహజవనరులు, ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అమ్మేస్తున్నారని విమర్శించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కాశినాయన: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవీంద్రబాబు, ఎం.బాలఓబయ్య కోరారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నూతనంగా ఏర్పడిన ఎస్టీయూ కార్యవర్గ సభ్యులు ఎంఈఓ నిర్మలను శాలువతో సత్కరించారు. ఎంఈఓ నిర్మల మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. పది మంది లోపు పిల్లలు ఉన్న పాఠశాలలను తొలగించాలని ప్రభుత్వం ఆలోచిస్తుందని, తొలగించకుండా ప్రభుత్వానికి విన్నవిస్తామని తెలిపారు.

ప్రకృతితో పయనం

మారిన జీవన శైలిలో ప్రకృతి పంటలు అవసరమవుతున్నాయి. ప్రకృతి సాగు పద్ధతిలో వ్యవసాయం చేయడం వలన బహుళ ప్రయోజనాలు ఉన్నాయి.
ఎటువంటి రసాయన ఎరువులు లేకుండా సేంద్రియ పద్ధతితో పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు రాబట్టడంలో రైతులు సత్ఫలితాలు సాధిస్తున్నారు. ప్రకృతి సాగు లాభసాటిగా ఉండటంతో అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు.

- సహజ ఎరువులు, కషాయాలతో పంటల సాగు
- ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పెరుగుతున్న సాగు విస్తీర్ణం



ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన పందిరి కాకర పంట

మైదుకూరు : అధిక పెట్టుబడి, తక్కువ దిగుబడులతో విసిగిపోయిన రైతులు మళ్లీ ప్రకృతి వ్యవసాయ బాట పడుతున్నారు. సహజ ఎరువులు, కషాయాలతో పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలను సాగు చేస్తూ, అధిక దిగుబడులను సాధిస్తున్నారు. భూమి నిస్సారం కాకుండా కాపాడుతున్నారు. దేశంలో పూర్వం ప్రకృతి పద్ధతులతోనే వ్యవసాయం చేసేవారు. తర్వాత విదేశీ కంపెనీలు విక్రయించిన రసాయనిక ఎరువులు వినియోగిస్తూ అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో రసాయనిక వ్యవసాయాన్ని ఎంచుకున్నారు. దీని వల్ల పెట్టుబడులు పెరిగిపోయాయి. చీడపీడలతో దిగుబడులు తగ్గాయి. రసాయనిక ఎరువులతో పండించిన పండ్లు, ధాన్యాన్ని వినియోగించడం వలన జబ్బుల బారిన పడుతుండటంతో తిరిగి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలను సాగు చేస్తున్న రైతులను ఎంతగానో ప్రోత్సహిస్తోంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై, సేంద్రీయ ఎరువులు, చీడపీడల నివారణకు వినియోగించే కషాయాల తయారీపై రైతులకు శిక్షణ ఇస్తూ రసాయనిక రహిత ఫలసాయాల ఉత్పత్తికి కృషి చేస్తోంది.

ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడం, జీవన ఎరువులను తయారు చేసుకునేందుకు కషాయాల తయారీని నేర్పేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటల సాగు చేసేందుకు రైతులను ఎంతగానో ప్రోత్సహిస్తోంది. రైతులు అవగాహన కార్యక్రమాలను, శిక్షణను సద్వినియోగం చేసుకొని పెట్టుబడులు తగ్గించుకుంటూ అధిక దిగుబడులను సాధిస్తున్నారు.

ప్రకృతి పద్ధతుల్లో పెరుగుతున్న విస్తీర్ణం

మైదుకూరు మండలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో రైతులు పంటలను సాగు చేస్తుండటంతో సాగు విస్తీర్ణం బాగా పెరుగుతోంది. ప్రస్తుతం మైదుకూరు మండలంలో సుమారు 1,000 ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. అరటి, బొప్పాయి, పసుపు, మిరప వంటి వాణిజ్య పంటలనేకాక టమాటా, బెండ, కాకర వంటి కూరగాయలు, దానిమ్మ, సీతాఫలం, నిమ్మ వంటి పండ్ల తోటలను కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. ఇటీవల మండలానికి చెందిన పలువురు రైతులు, వ్యవసాయాధికారులు, వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ప్రోత్సాహంతో పసుపు, దానిమ్మ, నిమ్మ వంటి పంటల్లో అధిక దిగుబడులను సాధిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం కింద పనిచేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రాల్లోని శాస్త్రవేత్తలు ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రదర్శన యూనిట్లను ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించాం. కృషి విజ్ఞాన కేంద్రం పరిధిలోని 25 మండలాల్లోని రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలను సాగు చేస్తున్నారు. రైతులు ఓబయ్య నరసింహారెడ్డి సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడులను సాధించడం సంతోషంగా ఉంది. – డాక్టర్ ఎం.బాలకృష్ణ, అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త, కేవీకే, వనిపెంట, మైదుకూరు మండలం

అధిక దిగుబడులు



ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులను సాధించవచ్చు ఈ పద్ధతులను అనుసరించడం వలన కలిగే లాభాలను వివరిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. జీవన ఎరువుల తయారీ, కషాయాల తయారీపై శిక్షణ ఇస్తున్నాం. దీని వలన మండలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలను సాగు చేసేందుకు రైతుల ఆసక్తి చూపుతున్నారు. సాగు విస్తీర్ణం పెరుగుతోంది. – పి.లక్ష్మీప్రసన్న, ఏఓ, మైదుకూరు మండలం

మార్పును కోరుతున్నారు



పంటల సాగు పద్ధతుల్లో రైతులు మార్పును కోరుకుంటున్నారు. గతంలో అధిక దిగుబడుల కోసం రసాయనిక ఎరువులను వినియోగించేవారు. దాని దుష్ఫలితాలను ఇప్పుడు తెలుసుకుంటున్నారు. ప్రకృతి వ్యవాయంపై మక్కువను పెంచుకుంటున్నారు. ఈ పద్ధతుల్లో పంటలను సాగు చేయడం వల్ల పెట్టుబడులను గణనీయంగా తగ్గించుకోవచ్చు. అధిక దిగుబడులను పొందవచ్చు. ఈ విషయాలపై రైతుల్లో అవగాహన పెంచుతున్నాం. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలను సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. – జె.ఆదినారాయణ, మోడల్ మేకర్, ప్రకృతి వ్యవసాయ విభాగం, మైదుకూరు మండలం

ఆదాయం పొందుతున్నాను



నాకున్న ఆరెకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలను సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నాను. ప్రధాన పంటగా పసుపు, అంతర పంటలుగా బంతి, బొప్పాయి, కొబ్బరి, సీతాఫలం తదితర చెట్లను పెంచుతున్నాను. అంతర పంటలతోనే పెట్టుబడి వస్తుంది. ఈ మధ్య అధిక ధర పలకడంతో పసుపు పంటతో అధిక ఆదాయం వచ్చింది. – శెట్టి వెంకటరామయ్య, రైతు, ఆదిరెడ్డిపల్లె, మైదుకూరు మండలం.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ ఆఫీసర్ హుస్సేనయ్య

బి.కోడూరు : మండలంలోని గోవిందాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆప్తాలిక్ ఆఫీసర్ హుస్సేనయ్య కంటి పరీక్షలు నిర్వహించారు. ఎప్పుడూ చీకటిగా ఉన్న ప్రదేశంలో చదవకూడదని, కంటి మీద ఒత్తిగి పెరుగుతుందని హుస్సేనయ్య తెలిపారు. వీలైనంత వరకు మొబైల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. మొత్తం 97 మంది విద్యార్థులకు గాను 85 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 9 మందికి కంటిలోపం ఉందని గుర్తించారు. వీరందరికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా కంటి అద్దాలు పంపిణీ చేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పోరుమామిళ్ల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని రేంజర్ రఘునాథరెడ్డి అన్నారు. మండలంలోని ఈదుళ్లపల్లె ఎంపీపీ పాఠశాల ఆవరణలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయుడు జనార్దనశెట్టి, రఘునాథరెడ్డి, పాఠశాల, అటవీశాఖ సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ మొక్కల పెంపకం వలన పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని, పచ్చదనంతో ఆక్సిజన్ సమృద్ధిగా లభిస్తుందని, వానలు సకాలంలో పడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేంద్ర, విద్యాకమిటీ చైర్మన్ జయమ్మ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీరమణ, బీట్ ఆఫీసర్లు కరుణాకర్, హసన్ బాషా, ఉపాధ్యాయులు నటరాజ, డాగ్ స్క్వాడ్ గురయ్య పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక లేపాక్షి డిగ్రీకళాశాల విద్యార్థులు యోగివేమన డిగ్రీకళాశాల విద్యార్థులు సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ కనపరచారు. రెండవ సెమిస్టర్ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ హానర్స్‌లో రిజ్వాన 9.7, ససుస్మిత 9.6, భార్గవి 9.3, బీకాం కంప్యూటర్స్‌లో పాల్గుణ 9.6, నాగహాసిని 9.4, 4వ సెమిస్టర్ బీఎస్సీ ఎంఎస్‌సీఎస్‌లో లక్ష్మీభారతి 8.8, గీతిక 8.4, ఎంపీసీఎస్‌లో తేజస్విని 8.6, బీకాం కంప్యూటర్స్‌లో సుధీర్ ఆచారి 8.6, చంద్రకళ 8.5 జీపీఏ సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, కరస్పాండెంట్ రాఘవరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.
యోగివేమన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ కనపరచారు. విద్యార్థులను కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, ప్రెసిడెంట్ సుదర్శనరెడ్డి, ఎస్ఎస్ఎఎస్ కో ఆర్డినేటర్ రామలక్ష్మిరెడ్డి, నాగరాజు, అధ్యాపకులు అభినందించారు.
మైదుకూరు : డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచినట్లు మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి తెలిపారు. యోగివేమన విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ప్రతిబకనపర్చడంతో ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేశారు.
పోరుమామిళ్ల: యోగి వేమన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ సెకండ్, ఫోర్త్ సెమిష్టర్ పరీక్షా ఫలితాల్లో పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీజెడ్‌సీ, బీఏ విద్యార్థులు వంద శాతం ఉత్తీరణ సాధించారని ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు తెలిపారు. బికామ్ విద్యార్థులు 90 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

26 మంది ఎంపీడీఓల బదిలీ

కడప సెవెన్‌రోడ్స్ : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కడప, అన్నమయ్య జిల్లాలకు బదిలీపై వచ్చిన 26 మంది ఎంపీడీఓలను తిరిగి వారి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిని రిలీవ్ చేస్తూ జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ప్రొసీడింగ్స్ ఇచ్చారు. బి.మఠం, మైదుకూరు, కాశినాయన, సిద్దవటం, అట్లూరు, దువ్వూరులలో పని చేస్తున్న శివమల్లేశ్వరప్ప, ఫజుల్ రెహ్మాన్, మధుసూదన్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, అమానుల్లా, సుగుణశ్రీలను సొంత జిల్లా అయిన కర్నూలుకు బదిలీ చేశారు. బద్వేలు, కలసపాడులలో పని చేస్తున్న రజనీకాంత్, కోటేశ్వరరావులను నెల్లూరు జిల్లాకు పంపారు. ఒంటిమిట్ట, లింగాల, సీకే దిన్నె, వల్లూరు, పెద్దముడియం, పులివెందుల, సింహాద్రిపురంలలో పని చేస్తున్న ఎంపీడీఓలు రామచంద్ర, తేజోష్ణ, షకీలాబేగం, విజయభాస్కర్, లక్ష్మినరసింహా, దివాకర్, సాల్మన్‌లను అనంతపురం జిల్లాకు పంపారు. ఇక అన్నమయ్య జిల్లాలోని సుండుపల్లె, రాయచోటి ఎంపీడీఓలు అమర్‌నాథ్, సురేంద్రనాథ్‌లను చిత్తూరుకు బదిలీ చేశారు. పుల్లంపేట, గాలివీడు, రామాపురం, చిన్నమండెం, ఓబులవారిపల్లె, సంబేపల్లె, చిట్వేలి మండలాల్లోని ఎంపీడీఓలు నరసింహామూర్తి, శ్రీనివాసులు, ప్రభాకర్, రామకృష్ణ, కుళ్లాయి స్వామి, యోగానందరెడ్డి, నిర్మలాకుమారి, వెంకటరంగారావులను అనంతపురం జిల్లాకు బదిలీ చేయగా, రైల్వేకోడూరులో పని చేస్తున్న కేవీ సుబ్రమణ్యంను కర్నూలు జిల్లాకు పంపారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

బద్వేలు అర్బన్ : బద్వేలు నియోజకవర్గంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర కోరారు. ఇల్లులేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని శుక్రవారం సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైతే రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని, పేదవాడు నివసించేందుకు సెంటు స్థలం ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ భూముల కబ్జాకు సహకరిస్తున్న రెవెన్యూ సిబ్బందిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, పట్టణ కార్యదర్శి బాలు, జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, ఏరియా కార్యవర్గ సభ్యులు పి.వి.రమణ, ఇమ్మానియేల్, పెంచలయ్య, విజయమ్మ, నాయకులు ఖాదర్‌బాషా, ఓబులపతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చాపాడు: మండలంలోని ఆరు విద్యుత్ సబ్ స్టేషన్లలో శనివారం మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సాయి తెలిపారు. ఆయా విద్యుత్ సబ్ స్టేషన్‌లో పరిధిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకూ విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.
ప్రొద్దుటూరు : విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ వీజీ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.
మైదుకూరు : మైదుకూరు మండల అర్బన్, రూరల్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రామభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.
పోరుమామిళ్ల: పోరుమామిళ్ల 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏడీ తెలిపారు.
బద్వేలు అర్బన్ : 33 కె.వి./11 కె.వి. సబ్‌స్టేషన్లలో మరమ్మత్తుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ ఎం.కుళాయప్ప, ఏఈలు ఎం.విజయకుమార్, ఎం.చిన్నయ్య, ఎస్.రమణలు తెలిపారు.

12 నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

చాపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఈ నెల 12 నుంచి 14 వరకు మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రహమతుల్లయ్య తెలిపారు. ఏపీ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. పంచాయతీ అభివృద్ధి, పంచాయతీ అవార్డులపై ప్రతి రోజూ ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు శిక్షణ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.

మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లో పొగలు

ప్రొద్దుటూరు క్రైం : ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్తున్న రైలు నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనలు చెందారు. ధర్మవరం నుంచి బయలుదేరిన మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ శుక్రవారం రాత్రి 9.30 గంటలకు ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్‌లో ఆగింది. అయితే స్టేషన్‌లో ఆగేందుకు బ్రేక్ వేసే సమయంలో ఏసీ బోగి వద్ద ఒక్కసారిగా పెద్ద ఎత్తున పొగ రావడంతో రైల్లో ఉన్న ప్రయాణికులు కిందికి దిగి పరుగులు తీశారు. స్టేషన్ ఆవరణమంతా పొగలు వ్యాపించడంతో ఏం జరిగిందో కొంత సేపు ప్రయాణికులకు అర్థం కాలేదు. ఈ విషయమై రైల్వే అధికారులు మాట్లాడుతూ.. రైలును స్టేషన్‌లో ఆపే క్రమంలో వర్షం పడటం వల్ల బ్రేక్‌లను పదే పదే వేయాల్సి వచ్చిందని, బ్రేకులు వేయడంతో ఏసీ బోగి చక్రాల కింద పొగ వచ్చిందన్నారు. రైల్వే అధికారులు, పైలెట్ బోగి వద్ద పరిశీలించిన అనంతరం 30 నిమిషాలు తర్వాత మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ వెళ్లినట్లు తెలిపారు.

పార్వతీదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో చాముండేశ్వరి అమ్మవారు

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఉన్న పార్వతీదేవికి శుక్రవారం శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వెంకటా చలపతి తెల్లవారుజామునే 303 నిమ్మకాయలతో దండ, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పార్వతీదేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.
ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్‌కాలనీ సత్యనారాయణస్వామి ఆలయంలోని చాముండేశ్వరి అమ్మవారికి శ్రావణమాస తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. 108 కలశాలలో అమ్మవారిని ఆవాహన చేసి పూజాకార్యక్రమాలను నిర్వహించి మంగళహారతులు ఇచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించి కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు.

బంగారు వ్యాపారి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో అశోక్‌కుమార్‌రెడ్డి (35) అనే బంగారు వ్యాపారి విషగులికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. అశోక్ కుమార్‌రెడ్డి మెయిన్‌బజార్‌లో బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. అతనికి నాలుగేళ్ల క్రితం నివాహారికతో వివాహం అయింది. వారికి ఏడాది వయసున్న కుమార్తె ఉంది. అతను కొంత కాలం నుంచి చిన్న చిన్న విషయాలకే కుటుంబ సభ్యులపై కోపం తెచ్చుకునేవాడని, రోజుల తరబడి అన్నం తినకుండా ఎవరితోనూ మాట్లాడేవాడు కాదని తెలిపారు. శుక్రవారం ఉదయం పొద్దుపోయినా లేవలేదు. దీంతో కుంటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లి చూడగా నేలపై పడిపోయి ఉన్నాడు. అతన్ని వెంటనే ఆస్పత్రికి తీసుకొని వెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మానసిక క్షోభతో అశోక్‌కుమార్‌రెడ్డి విషగుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. మృతుడి అన్న శ్రీనివాసులరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యురాలు నిఖిల

రాజుపాళెం : పోషకాహారం తీసుకోవడం వలన గర్భిణులు ఆరోగ్యంగా ఉండవచ్చని రాజుపాళెం పీహెచ్‌సీ వైద్యురాళ్లు మంజుల, నిఖిల పేర్కొన్నారు. ప్రధానమంత్రి సురక్షిత అభియాన్ కార్యక్రమం కింద రాజుపాళెం పీహెచ్‌సీలో శుక్రవారం మండలంలోని 30 మంది గర్భిణులకు పరీక్షలు చేసిన అనంతరం మాతాశిశు సంరక్షణ సేవలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తం వృద్ధి కొరకు ఐరన్ మాత్రలు వాడాలని, తొలి గర్భవతులకు పీఎంఎంవీవై పథకం కింద రూ.5 వేలు వారి అకౌంట్‌లో జమ అవుతుందని చెప్పారు. గర్భిణులు కాన్పుకు తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని వినయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

అట్లూరు : అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ కె.హమీదబేగం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.మాధురి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి హమీద బేగం మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ వెంకటరమణ, వైద్య సిబ్బంది పుష్పలలిత, సురేష్, గంగలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.
బి.కోడూరు : బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు 4వ నుంచి 9వ నెల వరకు తప్పనిసరిగా ప్రతి నెల 9వ తేదీన వైద్యులతో పరీక్ష చేయించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడాలని, పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, ఆప్తాల్మిక్ ఆఫీసర్ హుస్సేనయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి



ఎస్‌ఐ నాగమురళిని సన్మానిస్తున్న పోలీసు సిబ్బంది

కలసపాడు : ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి అని పోరుమామిళ్ల ఎస్‌ఐ తిమోతి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక సీఎంఆర్ కల్యాణ మండపంలో బదిలీపై వెళుతున్న ఎస్‌ఐ నాగమురళికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ తిమోతి మాట్లాడుతూ ఎస్‌ఐ నాగమురళికి సహకరించాలని కోరారు. ఎస్‌ఐ నాగమురళి మాట్లాడుతూ ప్రజలు, సిబ్బంది, నాయకులు అందించిన సహకారం మరువలేనని తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు స్టేషన్ల పరిధిలోని సిబ్బంది నాగమురళిని శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, చిత్తారాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

జనవాక్కు

పార్లమెంట్‌లో వక్ఫ్‌బోర్డు బిల్లుకు టీడీపీ మద్దతు ఇవ్వడంపై పలువురు ముస్లింలు తీవ్రంగా ఖండిస్తున్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీతో టీడీపీ జత కట్టడాన్ని ముస్లిం సమాజం తప్పబడుతోంది. ఎన్డీఏ ప్రభుత్వం ముస్లింల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. అలాగే విజయవాడలో అంబేద్కర్ సామాజిక న్యాయ శిల్పంపై టీడీపీ నాయకులు చేసిన దాడిని దళిత సమాజం ఖండిస్తోంది.

స్వేచ్ఛను హరించడమే



వక్ఫ్‌బోర్డుల చట్టానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన మార్పులు ముసిస్లిం సమాజం వారి భూమి, ఆస్తులు మతపరమైన వ్యవహారాలను నిర్వహించే స్వేచ్ఛను హరించడమే. ముస్లింల స్వేచ్ఛను హరించే బిల్లుకు లోక్‌సభలో టీడీపీ ఎంపీలు మద్దతు ఇవ్వడం దారుణం. తక్షణమే బిల్లును ఉపసంహరించుకోవాలి.
-అల్లాబకాష్, మాస్క్ కమిటీ అధ్యక్షులు, బద్వేలు

మద్దతు ఉపసంహరించుకోవాలి



కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌చట్టంలో సవరణలు చేయడం కోసం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లుకు టీడీపీ ఎంపీలు మద్దతు పలకడం సరికాదు. వివక్షతో కూడిన ఏకపక్షమైన బిల్లును వ్యతిరేకించాలి. వైఎస్సార్‌సీపీ ఎంపీలు బిల్లును వ్యతిరేకించినందుకు ధన్యవాదాలు. ముస్లింలకు అన్యాయం చేస్తే పోరాడుతామని హెచ్చరించారు.
-మహమ్మద్ హసన్, 13వ వార్డు కౌన్సిలర్, బద్వేలు

అంబేద్కర్‌కు అవమానం



భారత రాజ్యాంగ నిర్మాత, దళితుల ఆశాజ్యోతి బాబా సాహేబ్ అంబేద్కర్‌కు టీడీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర అవమానం జరుగుతోంది. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుతో మ్యూజియం ఏర్పాటు చేశారు. విజయవాడలో అంబేద్కర్ ప్రాంగణంలో అల్లరిమూకలు దాడి చేయటం హేయమైన చర్య.
-బండి పుల్లయ్య, మాలమహానాడు వైస్ ప్రెసిడెంట్, బద్రిపల్లె, చాపాడు మండలం

దాడిని ఖండించాలి



పేదల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహంపై జరిగిన దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలి. దళిత వర్గాల ఆరాధ్య దైవమైన అంబేద్కర్ విగ్రహంపై జరిగిన దాడి యావత్ దళిత సమాజంపై జరిగిన దాడి అని అన్నారు. వెంటనే కూటమి నేతలు ప్రజలకు క్షమాపణ చెప్పాలి. నిందితులను కఠినంగా శిక్షించాలి. ఈ ఘటనను అందరూ ఖండించాలి.
-ఎస్.వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి